
సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



ఒక్క మాత్రతో నులిమేద్దాం

పిల్లల్లో నులి పురుగుల నిర్మూలన లక్ష్యంగా వారి ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈనెల 9వ తేదీ నుంచి మందుల పంపిణీ చేపట్టనుంది. -8లో



వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎర్రగుంట్ల మున్సిపాలిటీలోని 1వ వార్డు ప్రకాశ్‌నగర్ కాలనీలో ఉండే 30 కుటుంబాల వారు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
37.1/19.0

వాతావరణం

జిల్లాలో గురువారం 19.0 – 37.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

26 నుంచి సెమిస్టర్ పరీక్షలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ, ఎంఈడీ కళాశాలల విద్యార్థులకు ఈనెల 26 నుంచి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి తెలిపారు. బీఈడీ, ఎంఈడీ మూడో సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ), మొదటి సెమిస్టర్ (సప్లిమెంటరీ) విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఈనెల 26, 27, 28, 29 తేదీలలో, మార్చినెల 1వ తేదీన పరీక్షలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌లు, టైంటేబుల్ కళాశాలల నుంచి పొందాలని సూచించారు.

పీజీ పరీక్షలు ప్రారంభం



పరీక్షలను పరిశీలిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్, అధికారులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పోస్టుగాడ్యుయేషన్ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంపీఈడీ ప్రథమ సెమిస్టర్ పరీక్షలు విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్‌బ్లాక్, సైన్స్‌బ్లాక్‌లో నిర్వహించారు. ఈ పరీక్షలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల హాల్‌టికెట్‌లను పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో క్యాంపస్ డ్రైవ్



ఎంపికైన విద్యార్థులతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

పులివెందుల రూరల్: బెంగళూరు వారి టాప్ అకాడమీ వార ఆధ్వర్యంలో గురువారం జేఎన్‌టీయూ కళాశాలలోని ఇంజినీరింగ్ విభాగంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ప్రస్తుతం కళాశాలలో 4వ సంవత్సరం బీటెక్ చదువుతూ టాప్ అకాడమీకి రిజిష్టర్ అయిన 108 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరందరికి ఆన్‌లైన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 10 మంది ఎంపికయ్యారు. వారిలో సీఎస్‌ఈ నుంచి ఐదుగురు, ఈసీఈ నుంచి ముగ్గురు,మెచ్ నుంచి ఒకరు, సివిల్ నుంచి ఒకరు ఎంపికయ్యారు.విద్యార్థులను, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాధాకృష్ణ, సాంబయ్యలను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూర్యానారాయణ అభినందించారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ విజయరామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. వివిధ అంశాలపై చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలో రానున్న సాధారణ ఎన్నికలను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాలను మరోమారు తనిఖీ చేసి వసతులు సమకూర్చాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సాధారణ భద్రతా ఏర్పాట్లు చూడాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువగా తీసుకు వెళ్లేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. మూడోదశ రీ సర్వే, ఇనాం, అసైన్డ్ భూములు, ఉపాధి హామీ, జలజీవన్ మిషన్, పేదలందరికీ ఇల్లు, పట్టాలు, రిజిస్ట్రేషన్లు తదితర అంశాలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ క్రీడాకారిణికి రజతం



లీజా కంసా

వైవీయూ: హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మస్థల్‌లో గురువారం నిర్వహించిన ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో యోగివేమన విశ్వవిద్యాలయానికి రజత పతకం లభించింది. వైవీయూ క్రీడాకారిణి లీజా కంసా 59 కేజీల విభాగంలో పాల్గొని రెండో స్థానంలో నిలిచి రజతం కైవసం చేసుకుంది. ఈమె 2023 డిసెంబర్‌లో రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో నిర్వహించిన దక్షిణ, పశ్చిమ భారతదేశపు స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొని కాంస్యపతకం కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, క్రీడా బోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి క్రీడాకారిణికి అభినందనలు తెలిపారు.



దేవునికడపలోని శ్రీ లక్ష్మివెంకటేశ్వరస్వామి ఆలయం



స్వామి, అమ్మవార్లు

రారండోయ్ వేడుక చూద్దాం

- నేటి నుంచి దేవునికడప ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు
- కమనీయం కడప రాయుని చరితం

కడప కల్చరల్: ఆంధ్రప్రదేశ్లో ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ఆలయాలు ఎన్నో ఉన్నాయి. అందులో వేటికి అవి చాలా ప్రత్యేకం. అలాంటి వాటిలో దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం ఒకటి. విశేష ఖ్యాతి, పురాణ ప్రసిద్ధిగల పర్యాటక ప్రాంతంగా ఈ ఆలయానికి ఎంతో పేరుంది. దీన్ని తిరుమలకు తొలి గడపగా భావిస్తారు. తిరుమల క్షేత్ర పాలకుడు వరహస్వామి అయితే, ఈ క్షేత్ర పాలకుడు హనుమంతుడు. ఎన్నో విశేషాలు గల ఈ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 9వ తేదినుంచి ప్రారంభం కానున్నాయి.

జనమే జయుని ప్రతిష్ట

దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ మూల విరాట్‌ను సాక్షాత్తు జనమే జయుడు ప్రతిష్ఠించాడని కడప కైఫీయత్తులో ఉంది. ఇందులోని సమాచారం ప్రకారం ఈ ప్రాంతానికి మొదట దేవుని గడపగా పేరుండేది. కాలక్రమంలో గడప కడపగా మారింది. జనమే జయుడు పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ తిరుమల వచ్చాడని, స్వామిని దర్శించుకుని ఆ రాత్రి అక్కడే నిద్ర చేశారని, కలలో శ్రీ వెంకటేశ్వరుడు కనిపించి తిరుమలలోని చెరువు కట్టపై తవ్వితే విగ్రహం కనిపిస్తుందని, దాన్ని ఫలానా చోట ప్రతిష్ఠించాలని సూచించినట్లు తెలుస్తోంది. తెల్లవారాక ఆయన చెరువుకట్టపై దాదాపు పూడిపోయి ఉన్న శ్రీ వెంకటేశ్వరుని విగ్రహాన్ని గమనించి ప్రతిష్ఠ చేసేందుకు సరైన ప్రాంతం కోసం అన్వేషించాడు.తిరుమలకు వాయువ్యంగా పది ఆమడల (ఆమడ అంటే పది మైళ్లు) దూరాన పుష్కరిణి సహితంగా వాయు పుత్రుడైన ఆంజనేయుని క్షేత్రం ఉన్నట్లు తెలుసుకున్నారు. ఈ విగ్రహాన్ని అక్కడ ప్రతిష్ఠించడం మంచిదని భావించారు. ఇందుకు నిదర్శనంగా నేటికీ కడప రాయుని మూల విరాట్ వెనుక పది అడుగులకు పైగా ఎత్తుగల ఆంజనేయుని విగ్రహం ఉంది. తొలుత ఈ స్వామిని కడప వెంకటేశ్వర్లు అని పిలిచేవారు. ఆంజనేయుడు శివుని అంశ గనుక శ్రీవారి ఆలయంతోపాటు ఆ ప్రక్కనే శివాలయాన్ని కూడా నిర్మింపజేశారు.

పాలనా చరిత్ర

దేవునికడపలో ప్రస్తుతం గల రాజగోపురాన్ని, తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయ రాజగోపురాన్ని ఒకేసారి నిర్మించినట్లు కైఫీయత్తుల ద్వారా తెలుస్తోంది. ఆలయంలోని రాజగోపురంతోపాటు ముఖ మండపం, గర్భాలయం, అంతరాళం ప్రాకారం మట్లి అనంతరాజు నిర్మించాడు. తర్వాత వైదుంబులు, ఓరుగంటి రాజులు, వల్లూరు పాలకులు, సంబెట రాజులు, సాళువ, సంగమ, తుళువ వంశీకులు ఈ క్షేత్రం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. సాక్షాత్తు శ్రీకృష్ణదేవరాయలు పలుమార్లు కడప రాయుడిని దర్శించుకుని మడిమాన్యాలు, ఆభరణాలు సమర్పించుకున్నారు. ప్రతిఏటా జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. 2006లో ఈ ఆలయాన్ని టీటీడీ తమపరిధిలోకి తీసుకుంది. ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు.

తిరుమలేశుని తొలిగడప



దేవునికడపను తిరుమలకు తొలిగడపకు భావిస్తాం. ఉత్తర ప్రాంతాల ప్రజలు ఏ కారణంగానైనా తిరుమల వరకు వెళ్లలేకపోతే కడపలోని లక్ష్మి వెంకటేశ్వరుడిని దర్శించుకుంటే వారి మొక్కులు తిరుమలేశునికి చేరుతాయని విశ్వాసం. ఉత్తర ప్రాంతాల వారు తిరుపతికి వెళ్లేటపుడు దేవునికడప స్వామిని దర్శించుకుని వెళుతుంటారు.

నేడు అంకురార్పణ

తిరుపతి : దేవుని కడపలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 10 నుంచి 18వ తేదీ వరకు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు ఈనెల 9వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య అంకురార్పణ జరుగనుందని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. 10న ఉదయం 10.30 గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని...15న ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం జరగనుందన్నారు.రూ.300 చెల్లించి గృహస్థులు (ఇద్దరు) పాల్గొనవచ్చని తెలిపారు.

తేదీ	ఉదయం సేవలు	రాత్రి వాహన సేవ
09.02.2024	అంకురార్పణ	సేనాధిపతి ఉత్సవం,
10.02.2024	తిరుచ్చి ధ్వజారోహణం	చంద్రప్రభ వాహనం
11.02.2024	సూర్యప్రభ వాహనం	పెద్దశేష వాహనం
12.02.2024	చిన్నశేష వాహనం	సింహవాహనం
13.02.2024	కల్పవృక్ష వాహనం	హనుమంత వాహనం
14.02.2024	ముత్యపుపందిరి ఉత్సవం	గరుడ వాహనం
15.02.2024	కల్యాణోత్సవం	గజవాహనం
16.02.2024	రథోత్సవం	ధూళి ఉత్సవం
17.02.2024	సర్వభూపాల వాహనం	అశ్వ వాహనం
18.02.2024	వసంతోత్సవం (చక్రస్నానం)	హంస వాహనం, ధ్వజావరోహణం
19.02.2024	--	పుష్పయాగం

దేవునికడపలో కోయిల్ ఆళ్వార్ సేవ

కడప కల్చరల్: తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలోని ప్రాకారాలు, మండపం, గర్భగుడి, పూజా సామగ్రి, శ్రీవారి భాషణం తదితర విభాగాలను శుద్ధి గాంచారు. పసుపు, కుంకుమ, పచ్చకర్పూరం, కర్పూరం, సాంబ్రాణి, వివిధ పత్ర విశేషాలతో తయారు చేసిన ద్రవ్యాలతో శుభ్రపరిచారు. ఏడాది పొడవున తెలిసో తెలియకో జరిగిన దోషాల నివారణకు, క్రిమి కీటకాదులు తొలగిపోయేందుకు కోయిల్ ఆళ్వార్ సేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తాం

- ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టిన రాఘవరెడ్డి



ఆర్‌జేడీగా బాధ్యతలను స్వీకరిస్తున్న రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ జోన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితోపాటు విద్యాభివృద్ధికి కృషి చేస్తామని పాఠశాల విద్య ఆర్‌జేడీగా బాధ్యతలు స్వీకరించిన ఎద్దుల రాఘవరెడ్డి పేర్కొన్నారు. గురువారం కడపలో ఆర్‌జేడీగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2013 మార్చి 7వ తేదీ అన్నమయ్య జిల్లా నుంచి బదిలీపై వచ్చి వైఎస్సార్ జిల్లా డీఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఏడాదిలోపే పాఠశాల విద్య ఆర్‌జేడీగా పదోన్నతి పొంది ఇక్కడే బాధ్యతలు స్వీకరించారు. రాఘవరెడ్డికి ఆర్‌జేడీ కార్యాలయ ఏడీ, సూపరింటెండెంట్లు, సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు శుభాకాంక్షలు తెలియచేశారు.

పదిలో ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయం

నూతన డీఈఓ అనూరాధ



డీఈఓగా బాధ్యతలను స్వీకరిస్తున్న అనూరాధ

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది నిర్వహించబోయే పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తామని నూతన జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన మర్రెడ్డి అనూరాధ పేర్కొన్నారు. గురువారం కడపలోని డీఈఓ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ)గా అమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు జరుగున్నాయన్నారు. వీరంతా ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కూడా చర్చిస్తానని చెప్పారు.

జూనియర్ అసిస్టెంట్ నుంచి డీఈఓ స్థాయికి...

అనూరాధ 1991లో గ్రూపు–2 బి పరీక్షలు రాసి హైదరాబాద్‌లోని డీజి ఐజి ఆఫ్ ప్రిజెన్స్‌లో (జైళ్లశాఖలోని బాల నేరస్తుల పాఠశాలలో) జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరారు. 1992లో హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది 1997 వరకు అక్కడే పనిచేశారు. 1998లో బదిలీపై కర్నూలు జిల్లాకు ఎఫ్ఏసీ జిల్లా మైనార్టీ ఆఫీసర్‌గా వచ్చారు. 9 ఏళ్లపాటు అక్కడే పనిచేశారు. 2006లో సూపరింటెండెంట్‌గా పదోన్నతిపై హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు వెళ్లారు. 2013లో మోడల్ స్కూల్స్ ఏడీగా పదోన్నతి పొంది రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. 2015లో రాష్ట్ర విభజనలో కర్నూలు జిల్లా డీఈఓ కార్యాలయ ఏడీ–1గా వచ్చారు. అక్కడే 2019 నుంచి 2021 వరకు డిప్యూటీ డీఈఓగా కూడా పనిచేశారు. 2022లో జిల్లాల విభజనతో నంద్యాల జిల్లా ఏడీగా వచ్చి అక్కడే పనిచేస్తూ ప్రస్తుతం పదోన్నతిపై వైఎస్సార్‌జిల్లా డీఈఓగా కడపకు వచ్చి విధుల్లో చేరారు.

రాజ్యసభలో 'రాజంపేట'కు చోటు!

వైఎస్సార్‌సీపీ వర్గాల్లో నూతనోత్సాహం

రాజంపేట: రాజ్యసభలో రాజంపేటకు తొలిసారిగా చోటు దక్కనుంది. ఈ అవకాశం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు. 1952 నుంచి ఉమ్మడి నియోజకవర్గంలో రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు కొనసాగాయి. ఉమ్మడి నియోజకవర్గంగా ఉన్నప్పటి నుంచి నేటి వరకు పంజం నరసింహారెడ్డి, టీ.విశ్వనాథరెడ్డి, పార్థసారధి, పాలకొండ్రాయుడు, సాయిప్రతాప్, పీవీ మిథున్‌రెడ్డి ఎంపీలుగా కొనసాగారు. కానీ రాజంపేట నుంచి రాజ్యసభకు ఇప్పటి వరకు ఎవరూ వెళ్లలేదు. ఈ అవకాశం ఎంఆర్‌కేఆర్ అధినేత మేడా రఘునాథరెడ్డికి దక్కింది. ఈయన ప్రస్తుత శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి సోదరుడు కావడం గమనార్హం.

మాటనిలబెట్టుకున్న ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మడమతిప్పరు..మాటతప్పరని మరోసారి నిరూపించాడు. రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆకేపాటి అమరనాథరెడ్డిని బరిలోకి దింపిన నేపథ్యంలో సీఎం నిర్ణయానికి కట్టుబడిన తరుణంలో ఎమ్మెల్యే సోదరుడు మేడా రఘునాథరెడ్డికి రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో వైఎస్సార్‌సీపీ క్యాడర్‌లో నూతనోత్సాహం వెల్లివిరిస్తోంది. ప్రస్తుత ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి వర్గీయులు తమ నేత ఎంపీ(రాజ్యసభ) కాబోతున్నాడన్న ఆనందం అవధులు దాటుతోంది. మేడా సొంత మండలంతోపాటు పలు మండలాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

సీఎం నిర్ణయమే శిరోధార్యం



నా తమ్ముడు మేడా రఘునాథరెడ్డిని రాజ్యసభ అభ్యర్థిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయం. ముఖ్యమంత్రికి ఎప్పటికీ విధేయులుగా ఉంటాం. సీఎం నిర్ణయమే శిరోధార్యం.

–మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

ముఖ్యమంత్రి రుణం తీర్చుకోలేనిది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిది. గత ఎన్నికల్లో నా అన్న మేడా మల్లికార్జునరెడ్డికి వైఎస్సార్‌సీపీ టికెట్ ఇచ్చి రాజంపేట ఎమ్మెల్యేగా పనిచేసే అవకాశం కల్పించారు. మా అన్నకు ఈ సారి అవకాశం లేనప్పటికి, తనకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గొప్ప మనిషి వైఎస్ జగన్. నా ఊపిరి ఉన్నంతవరకు వైఎస్సార్ కుటుంబం వెంటే ఉంటా. నన్ను రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. –మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ అభ్యర్థి

గూండారాజ్!

- కడపలో పెట్రేగిపోతున్న టీడీపీ శ్రేణులు
- కార్పొరేటర్ కుమారుడు పీరుల్లాపై హత్యాయత్నం
- మొన్న వలంటీర్ కుటుంబంపై దౌర్జన్యం
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి దంపతుల దౌర్జన్యకాండ



సాక్షి ప్రతినిధి, కడప: శాంతిభద్రతలకు నిలయంగా, మత సామరస్యానికి ప్రతీకగా.. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న జిల్లా కేంద్రమైన కడపలో దౌర్జన్యకర ఘటనలు జరుగుతున్నాయి. ఏదో ఒకచోట టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. రెండు నెలల తర్వాత అధికారం మాదే, మేమేంటో చూపిస్తామంటూ అధికారులను సైతం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు.ఒక్కమాటలో చెప్పాలంటే టీడీపీ శ్రేణులు గూండారాజ్‌ను మరిపిస్తున్నారు. ఇదివరకు ఎన్నడు లేనివిధంగా టీడీపీ ఇన్‌చార్జిగా ఆర్ మాధవీరెడ్డి నియామకమయ్యాక ప్రత్యక్ష ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా కార్పొరేటర్ షబానా కుమారుడు పీరుల్లా(26)పై హత్యాయత్నానికి పాల్పడ్డారు. కడప నగరం మోచంపేట 39వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి అరీఫ్ మరికొంతమంది కలిసి పీరుల్లాపై గురువారం హత్యాయత్నానికి పాల్పడ్డారు. మొన్న మృత్యుంజయకుంట సమీపంలో మాధవీరెడ్డి 'బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ'కార్యక్రమంలో భాగంగా ప్రచారానికి వెళ్లింది. ఇంటింటా టీడీపీ స్టిక్కర్లు గృహస్తుల అనుమతి లేకుండా అతికించారు. గమనించిన వలంటీర్ ఆంజనేయులు తన ఇంటికి టీడీపీ స్టిక్కర్ అతికిస్తుంటే అభ్యంతరం చెప్పారు. నా అనుమతి లేకుండా ఇలా చేయొద్దన్నందుకు టీడీపీ నేతలు దేరంగుల శివ, శివశంకర్ వాదనకు దిగారు. వలంటీర్‌పై దాడి చేశారు. అంతటితో ఆగకుండా మాధవీరెడ్డి తన ప్రైవేటు సైన్యంతో అక్కడికి వెళ్లి రచ్చ చేశారు. ఈవ్యవహారం చిన్నచౌక్ పోలీసుస్టేషన్‌కు చేరింది. పోలీసుస్టేషన్‌లో సైతం పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి రెండు నెలల్లో మా ప్రభుత్వం వస్తుంది, తర్వాత నేనేంటో చూపిస్తానంటూ బెదిరింపులకు దిగారు. కలెక్టర్ విజయ్‌రామరాజు బుధవారం ఓటర్ల తొలగింపులు, చేర్పులు వ్యవహారంపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న శ్రీనివాసులరెడ్డి అదే పదజాలన్నీ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ అయిన విజయరామరాజు ఎదుట సైతం ఉపయోగించడం విశేషం.

క్రమం తప్పకుండా దౌర్జన్యాలు....

ఎన్నికల ప్రచారంలో భాగంగా డివిజన్లలో పర్యటిస్తున్న మాధవీరెడ్డి ఇటీవల దౌర్జన్యకర ఘటనలకు పాల్పడుతున్నారు. మొన్న టీడీపీ బృందం ప్రచారం చేసుకుంటూ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నేత వినోద్‌కుమార్ ఇంటికి వెళ్లారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే అభ్యంతరం చెప్పారు. వెంటనే వినోద్‌కుమార్‌ను టార్గెట్ చేసి, స్వయంగా మాధవీరెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. శ్రీనివాసులరెడ్డి దంపతులు డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను సైతం ఏకవచనంతో సంబోధించడం పరిపాటిగా పెట్టుకున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. సోషల్ మీడియా కేంద్రంగా ఏకవచనంతో సంబోధిస్తూ కావాలనే సామాజికంగా ఎక్స్‌పోజ్ చేస్తున్నారని పలువురు భావిస్తున్నారు.

కవ్వింపు చర్యలు మానుకోండి

టీడీపీ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది.వీటిని మానుకోవాలి. అకారణంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులను టార్గెట్ చేస్తున్నారు. లక్కిరెడ్డిపల్లె, చక్రాయపేట, రామాపురం ప్రాంతాలకు చెందిన ప్రైవేటు సైన్యంతో శ్రీనివాసులరెడ్డి, మాధవీరెడి జిల్లా కేంద్రంలో దౌర్జన్యకర ఘటనలకు పాల్పడుతున్నారు. ఇలాంటివి పునరావృతమైతే టీడీపీ నేతలు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. – సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

కడపను కలుషితం చేస్తే సహించం


టీడీపీ ఇన్‌చార్జి మాధవీరెడ్డి, ఆమె భర్త శ్రీనివాసులరెడ్డి కడపలో శాంతిభద్రతలకు భంగం కల్గిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ యువజన నేత పీరుల్లాపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజామెప్పుతో నాయకుడిగా ఎదగాలని సూచిస్తున్నారు. టీడీపీ నేతలు రౌడీయిజంతో రాజకీయం చేయాలని చూస్తున్నారు.శాంతియుత వాతావరణంలో ఉన్న కడపను కలుషితం చేస్తే సహించం. –అంజద్‌బాషా, డిప్యూటీ సీఎం

ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే ఖబడ్దార్: అహ్మద్‌బాషా



కడప అర్బన్: కడప నగరంలో ఇటీవల వరుసగా వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, వాలంటీర్లపై దాడులకు పాల్పడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగేలా కడప టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ మాధవిరెడ్డి, ఆమె భర్త శ్రీనివాసులరెడ్డి ప్రవర్తిస్తున్నారని వైఎస్ఆర్‌సీపీ యువనాయకుడు ఎస్.బి అహ్మద్‌బాషా ధ్వజమెత్తారు.ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. కడపలోని 31వ డివిజన్‌లో ఫ్లెక్సీలకు సంబంధించిన వ్యవహారంలో స్థానికంగా విద్వేషాలను రెచ్చగొట్టడం,11వ డివిజన్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్లను చించివేసే ప్రయత్నం చేస్తే అడ్డుకున్న వలంటీర్‌పై దాడి చేయడం సరి కాదన్నారు. తాజాగా 39వ డివిజన్‌లో కార్పొరేటర్ షబానాభాను, షేక్ కమాల్‌బాషాల కుమారుడు పీరుల్లాపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడటం ఎంతవరకు సమంజసమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడితే వారిపై తాము కూడా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కాగా సంఘటన జరిగిన సమయంలో టీడీపీ నాయకులు కొందరు పోలీస్‌స్టేషన్ వచ్చారు. తరువాత వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు చేరుకున్నారు. పోలీస్ స్టేషన్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో సీఐలు తబ్రేజ్, నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌నాయక్, రామచంద్ర, ఎస్ఐలు సంజీవరాయుడు, రవికుమార్, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, పోలీసు సిబ్బంది బందోబస్తు విధులను నిర్వహించారు.

మాధవీ..మర్యాదగా మసలుకో!



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా నేతలు

కడప రూరల్ /కడప అర్బన్: ప్రశాంతంగా ఉన్న కడపకు వచ్చి విద్వేషాలను నింపుతున్న కడప నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మాధవిరెడ్డి మర్యాదగా మసలుకుని ప్రవర్తించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప నగర మహిళా నేతలు హితవు పలికారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో పార్టీ కడప సోషల్‌మీడియా కన్వీనర్ సునీతరెడ్డి మాట్లాడుతూ మాధవిరెడ్డికి ఓటమి భయం పట్టుకుందన్నారు. దీంతో ఆమె మతిస్థిమితం లేని వ్యక్తిలా ప్రవర్తించడమే కాకుండా డిప్యూటీ సీఎం అంజద్‌బాషతోపాటు వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. బుధవారం రాత్రి 10–12 గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి ఫోన్ చేసి తనను బెదిరించడమే కాకుండా ఇష్టానుసారంగా దూషించారన్నారు. కడప టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మాధవిరెడ్డి నియమితులైనప్పటి నుంచి ఆ పార్టీ కార్యకర్తల ఆగడాలు, బెదిరింపులు ఎక్కువయ్యాయని తెలిపారు. ఈ విషయమై జిల్లా ఎస్పీకి, కడప డీఎస్పీకి ఫిర్యాదు చేశామని సోషల్ మీడియా కన్వీనర్లు సునీతారెడ్డి, నిశాంత్‌లు తెలిపారు. పార్టీ మహిళా విభాగం కడప నగర అధ్యక్షురాలు వెంకటసుబ్బమ్మ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న కడపకు మాధవిరెడ్డి శూర్పనఖలా వచ్చారని అన్నారు. పార్టీ నాయకులు పద్మావతి, మరియలు, సుశీల, తులశమ్మ, నారాయణ, నిర్మల పాల్గొన్నారు.


ఒక్క మాత్రతో నులిమేద్దాం

- నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం
- అన్ని యాజమాన్య పాఠశాలల్లో పిల్లలకు మందుల పంపిణీ
- కడప నాగరాజుపేట మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్య, వైద్య ఆరోగ్యశాఖలు

కడప ఎడ్యుకేషన్ : కంటికి కనిపించని శత్రువు.. ఒంటికి హాని కలిగించే రుధిర పురుగు నులిపురుగు. ఇది మనిషి పేగుల్లో మకాం వేసి రక్తాన్ని పీల్చిపిప్పి చేస్తూ పిల్లల్లో రక్తహీనతను కలిగిస్తుంది. నులి పురుగులు అధికశాతం అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. దీని నివారణకు జిల్లా వ్యాప్తంగా ఈనెల 9వ తేదీ అన్ని అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటిఐలలో చదివే వారందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం వైద్యశాఖాధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన మాత్రలను ఇప్పటికే అంగన్‌వాడీలు, స్కూళ్లు, కళాశాలలకు తరలించారు. ఈ మేరకు జిల్లాస్థాయి కార్యక్రమాన్ని ఈనెల 9వ తేదీ శుక్రవారం కడపలోని నాగరాజుపేట మున్సిపల్ హైస్కూల్‌లో మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించనున్నారు. నగరపాలక కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగరాజు హాజరు కానున్నారు. ఏడాది వయసు నుంచి 19 ఏళ్ల వయసు ఉన్న పిల్లలందరికి ఈ నులిపురుగులను నివారించే మాత్రలను వేయనున్నారు.

నులి పురుగుల వ్యాప్తి ఇలా...

నులి పురుగులు కలుషిత ఆహారం, ఈగలు వాలిన తినుబండారాలు, దుమ్ము, ధూళి పడిన పదార్థాలు తినడం వలన వ్యాపిస్తుంది. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం ద్వారా, కాళ్లకు చెప్పులు లేకుండా మరుగుదొడ్డికి వెళ్లడం ద్వారా కూడా వచ్చే అవకాశం ఉంది. ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, వంట సరుకులు శుభ్రమైన నీటితో కడగకపోవడం వలన, భోజనం వండేవారు, వడ్డించేవారు తినేముందు, తిన్న తరువాత చేతులు శుభ్రంగా కడుక్కోకపోవడం వల్ల, చేతివేళ్లకు గోర్లు ఉండటం వల్ల కూడా వచ్చే అవకాశం ఉంది. వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వల్ల, ఇంటి పరసరాలు అపరిశుభ్రంగా ఉండటం, పిల్లలు అందులో ఆడుకోవటం వల్ల అందులోని నులిపురుగుల లార్వాలు జీర్ణకోశంలోకి ప్రవేశించడం వలన వచ్చే అవకాశం ఉంది.



బాల్యం చిక్కిపోతోంది...

నులి పురుగుల కారణంగా అందమైన బాల్యం చిక్కిపోతోంది. వీటి నివారణ కోసం జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలు 4,71,835 మంది ఉన్నారు. ఇందులో 1 సంవత్సరం నుంచి 2 సంవత్సరాల పిల్లలకు (అంగన్‌వాడీ కేంద్రంలోని) ఆల్‌బెండజోల్ 400 ఎంజీలో అర్ధమాత్రను పొడి చేసి గ్లాస్‌నీళ్లలో కలిపి వారి తల్లి సమక్షంలో మధ్యాహ్నం భోజనం తరువాత తాగించాలి. ఆ తర్వాత నుంచి 19 సంవత్సరాల పిల్లలకు 400 ఎంజీ పూర్తి మాత్రను(చప్పరించదగినది) మధ్యాహ్నం భోజనం తరువాత నీళ్లలో మింగించాలి. భోజనం చేయకుండా మాత్రను వేసుకుంటే కడుపునొప్పి, వాంతులు అయ్యే అవకాశం ఉంది. అలాగే విద్యార్థులకు జ్వరం లేదా ఇతర ఇతర కారణాల వలన అనారోగ్యంగా ఉన్నప్పుడు వారికి ఆల్‌బెండజోల్ 400 గ్రాముల మాత్రలు ఇవ్వకూడదు.

ఉపాధ్యాయులు పాటించాల్సిన నియమాలు..

ఈ నులి పురుగుల కార్యక్రమం గురించి అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అరోగ్యశాఖ అధికారులు స్నేహపూర్వక వాతావరణంలో విద్యార్థులకు ముందుగా అవగాహన కల్పించాలి.

- పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తరగతి గదిలో ప్రార్థన సమయంలో ఆల్‌బెండోజోల్ 400 గ్రాముల మాత్రల ఆవశ్యకతను వివరించడంతోపాటు చేతుల పరిశుభ్రత గురించి విద్యార్థులకు వివరించాలి.
- ఆల్‌బెండజోల్ 400 గ్రాముల మాత్రలు పాఠశాల వేళల్లో మాత్రమే విద్యార్థులకు అందజేయాలి. ఒక వేళ విద్యార్థులు ఎవరైనా ఆ రోజు పాఠశాలకు హాజరు కానట్లయితే వారి ఇంటికి మాత్రలు చేర్చి విద్యార్థికి అందేలా చూడాలి.

నులిపురుగుల నిర్మూలన వల్ల ప్రయోజనాలు..

- పిల్లల్లో రక్తహీనత నియంత్రిస్తుంది
- పోషకాహార ఉపయోగతను మెరుగు పరుస్తుంది
- వ్యాధి నిరోధకతను మెరుగు పరుస్తుంది
- ఏకాగ్రత, నేర్చుకోగల సామర్థ్యం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి హాజరు మెరుగుపరుస్తుంది.

పక్కాగా అమలు చేయాలి



జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరూ ఈ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలి. విద్యార్థులందరికి ఆల్‌బెండజోల్ 400 గ్రాముల మాత్రలను ఇవ్వాలి. ఈ విషయంలో వైద్యశాఖ, విద్యాశాఖ సమన్వయంతో అన్ని జాగ్రత్లను పాటిస్తూ పిల్లలతో మాత్రలను మిగించాలి. ఐదైనా సమస్య అని పిస్తే తక్షణం వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలి.

- మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖాధికారి

చిన్నారుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం



పిల్లల్లో నులి పురుగుల నిర్మూలన లక్ష్యంగా వారి ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ నులి పురుగుల నిర్మూలనకు సంబంధించిన ఆల్‌బెండజోల్ 400 గ్రాముల మాత్రలను జిల్లాలోని అన్ని పాఠశాలలకు పంపించాము. 2 ఏళ్లలోపు పిల్లలకు సగం మాత్రను నలిపి వేయాలి. 3 ఏళ్ల నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఒక మాత్ర చొప్పున వేయాలి.

- డాక్టర్ కె. నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. –సాక్షి నెట్‌వర్క్

సొంత ఇంటి కల నెరవేరింది



నాకు వివాహమై దాదాపు 15 ఏళ్లు అయింది. గత ప్రభుత్వం నాకు ఇంటి స్థలం మంజూరు చేయలేదు. కాని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చి, అందులో హౌసింగ్ తరపున ఇంటిని కూడా మంజూరు చేయించారు. నాకు ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సొంత ఇంటి కలను సీఎం జగన్ మోహన్ రెడ్డి నెరవేర్చారు. సంతోషంగా ఉంది.

-నాటకరాణి యానాదమ్మ, ఒంటిమిట్ట

నాడు-నేడు ఒక బృహత్తర పథకం



వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత నాడు-నేడు అనే బృహత్తర పథకంతో ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు మార్చేశారు. ఈ రోజు కార్పొరేట్ పాఠశాలలకు మించి వసతులు కలగడం సంతోషదాయకం. ముఖ్యంగా విద్యార్థులకు మరుగుదొడ్లు, సురక్షిత మంచి నీటి వసతి వంటి మౌలిక వసతులతో పాటు, మధ్యాహ్న భోజన పథకంలో రోజుకు ఒక మెనూ, ప్రతి రోజు గుడ్డు, చిక్కి, రాగి జావ ఇస్తున్నారు. ఇలాంటివి చూస్తే విద్యార్థులపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రేమ ఏమిటో తెలుస్తుంది.

- చంద్రశేఖర్, ఒంటిమిట్ట జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు

కత్తి పట్టుకుని వ్యక్తి హల్‌చల్

కడప అర్బన్ : కడప నగరం రాజారెడ్డి వీధిలో ఓ వ్యక్తి కత్తితో చేయికోసుకుని, వీడియో కాల్ మాట్లాడుతూ హల్ చల్ చేశాడు. స్థానికుల సమాచారంతో అతన్ని కడప ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తీసుకుని వెళ్లారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

చాపాడు: మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 40 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆర్‌వీ కొండారెడ్డి తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అట్లూరులో..

అట్లూరు : మండల పరిధిలోని ఎస్.వెంకటాపురం కాలనీకి చెందిన నడిపి ఓబులేసు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో అతన్ని అరెస్టు చేసి 40 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.సి.రాజు తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

పోరుమామిళ్ల: అంబేడ్కర్ సర్కిల్ వద్ద చిన్న యరసాలకు చెందిన కొట్టం తిరుపతయ్య అనే బెల్టుషాపు నిర్వాహకుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 42 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య



మృతురాలు లక్ష్మీదేవి

చాపాడు : మండల పరిధిలోని వి.రాజుపాళెం గ్రామంలో అనారోగ్యం కారణంగా లోమడ లక్ష్మీదేవి(36) అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ ఆర్‌వీ కొండారెడ్డి తెలిపిన వివారాల మేరకు.. గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి భార్య లక్ష్మీదేవి గత కొన్నేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి పదో తరగతి చదువుతున్న కుమారుడు, తొమ్మిదవ తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చింతకొమ్మదిన్నెలో విద్యార్థి..



ఉరి వేసుకొని మృతి చెందిన అమరేష్

చింతకొమ్మదిన్నె : కడప రాయచోటి ప్రధాన రహదారిలోని అన్నమాచార్య కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్న అమరేష్(19) అనే విద్యార్థి గురువారం తను ఉంటున్న గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన స్థలాన్ని రూరల్ సీఐ శివ శంకర్ నాయక్, సీకే దిన్నె ఎస్ఐ బి. శ్రీనివాసులు రెడ్డి పరిశీలించారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణదారుల నుంచి మా ప్లాట్లను కాపాడండి



ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సొసైటీ సభ్యులు, ప్లాటుదారులు

కడప ఎడ్యుకేషన్ : చింతకొమ్మదిన్నె మండలం పబ్బాపురం సమీపంలో ఎలిమెంటరీ అండ్ ప్రైమరీ స్కూల్స్ టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటికి సంబంధించిన టీచర్స్ ప్లాట్లను అక్రమార్కుల చెరనుంచి కాపాడాలని గురువారం కడప ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథరెడ్డి, బాలశౌరిరెడ్డితోపాటు సభ్యులు, ప్లాటుదారులు ఆందోళన చేశారు. గత 30 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న ఈ ప్లాట్లను నేడు ఎవరో ఆక్రమణదారులు వచ్చి ఈ ప్లాట్లు మావి అంటూ తమపై దాడి చేశారన్నారు. అంతేకాకుండా ప్లాట్లకు సంబంధించిన నంబర్ రాళ్లను సైతం పగులగొట్టి తమను భయభ్రాంతులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు కలిగించుకుని తమకు న్యాయం చేయాలని వారు వేడుకున్నారు.

జాతీయ ఫైర్ సర్వీస్ క్రీడల్లో వైఎస్ఆర్ జిల్లాకు 8 పతకాలు



అగ్నిమాపక ఉద్యోగులను అభినందిస్తున్న జిల్లా అగ్నిమాపక అధికారి ఐ. ధర్మారావు

కడప అర్బన్ : జాతీయ స్థాయి ఫైర్ సర్వీస్ క్రీడల్లో వైఎస్సార్ జిల్లాకు 8 పతకాలు సాధించిన అగ్నిమాపక అధికారులు, సిబ్బందిని జిల్లా అగ్నిమాపక అధికారి ఐ. ధర్మారావు అభినందించారు. గురువారం జిల్లా విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ కార్యాలయంలో జాతీయ స్థాయి ఫైర్ సర్వీస్ క్రీడా పోటీల్లో పాల్గొని, 8 పతకాలను సొంతం చేసుకున్న ఫైర్ అధికారులు, సిబ్బంది జిల్లా అగ్నిమాపక అధికారిని కలిశారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ జిల్లాకు చెందిన ఏడీఎఫ్ఓ పి. బసిరెడ్డి (కడప), ఫైర్ సిబ్బంది సి. శ్రీనివాసుల రెడ్డి, ఎం. చిన్ను, ఓ. సంజీవరెడ్డి టీమ్ 1 బంగారు పతకం, 2 వెండి పతకాలు, 5 కాంస్య పతకాలు సాధించడం జిల్లా గర్వించదగ్గ విషయమన్నారు.

ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికుల ధర్నా



మాట్లాడుతున్న కమిటీ జనరల్ సెక్రటరీ వి.సుబ్బిరెడ్డి

ఎర్రగుంట్ల : ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఇచ్చిన రాష్ట్ర వ్యాపిత పిలుపు మేరకు డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు గురువారం ప్లాంట్ ప్రధాన గేటు బయట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ జనరల్ సెక్రటరీ వి.సుబ్బిరెడ్డి మాట్లాడుతు ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 30 కుటుంబాలు చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపాలిటీలోని 1వ వార్డు ప్రకాశ్‌నగర్ కాలనీలో ఉండే 30 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బాలగంగమ్మ, శరత్ కుమార్, చంద్రకాంత్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు ఇన్‌చార్జి ప్రశాంత్, పార్టీ నాయకులు దండే రవిప్రకాశ్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు



హత్యకేసులో నిందితుడు గుడిటి పవన్ కుమార్

రాయచోటి టౌన్ : హత్య కేసులో నిందితుడు గుడిటి పవన్‌కుమార్ (26)కు రాయచోటి కోర్టు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పింది. రాయచోటి రూరల్ సీఐ యం. తులశీరాం, సుండుపల్లె ఎస్ఐ ఎస్‌కె హుస్సేన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం కొండల తూర్పు గ్రామంలో గత ఏడాది జూన్ 16వతేదీన చిన్నరెడ్డివారి రామాంజుల రెడ్డి ఆయన భార్య మనోహరితో కలసి ఆయన పొలం వద్ద ఉన్న ఆవుల షెడ్‌లో నిద్రిస్తున్నారు. అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన గుడిటి పవన్‌కుమార్ తన భర్తతో కలిసి నిద్రిస్తున్న మనోహరి ఒంటిపై నగలు కాజేసేందుకు యత్నించి ఆమె భర్త కళ్లలో కారం చల్లాడు. అయితే అతను ప్రతిఘటించడంతో తన వద్ద ఉన్న కొడవలితో విచక్షణా రహితంగా గొంతుపై నరికాడు. దీంతో రామాంజుల రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై అప్పటి సీఐ లింగప్ప, సుండుపల్లె ఎస్ఐ బి. రామకృష్ణారెడ్డిలు విచారణ నిర్వహించి నిందితుడిపై క్రైం నంబర్ 67/2023 కింద హత్య కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ సాగించిన న్యాయస్థానం గురువారం ఇరువురి వాదనలు విన్న తరువాత నేరం రుజువు కావడంతో జిల్లా ఐదవ అదనపు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి ఐపీసీ 302 ప్రకారం జీవిత ఖైదుతో పాటు రూ.2000లు జరిమానా, అలాగే ఐపీసీ 307 ప్రకారం 7 సంవత్సరాలు జైలు జీవితం, రూ.1000లు జరిమానా, ఐపీసీ 382 ఆర్/డబ్ల్యూ 511 కింద జైలు శిక్షతో పాటు రూ.1000లు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.జగన్ మోహన్‌రెడ్డి వాదించారు.

కడప రిమ్స్ ఈఎన్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గోల్డ్‌మెడల్



డాక్టర్ శ్రవణ్‌కుమార్‌ను అభినందిస్తున్న కడప రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ

కడప అర్బన్ : కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)లో ఈఎన్‌టీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ శ్రవణ్‌కుమార్ 2020 సంవత్సరంలో ఎం.ఎస్, ఈఎన్‌టీ పరీక్షల్లో అత్యధిక ప్రతిభ కనబర్చినందుకు గోల్డ్ మెడల్ సాధించారు. ఈనెల 6న విజయవాడలో వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీలో నిర్వహించిన స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ఈ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం కడపలోని ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, డాక్టర్ శ్రావణ్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈఎన్‌టీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ భాస్కరన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శారద మాట్లాడారు. డాక్టర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ తనకు ఈ గౌరవం దక్కడానికి కారకులైన తమ అధ్యాపకులైన ఎక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ వెంకటసుబ్బయ్య, ఈఎన్‌టీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుధ, డాక్టర్ కిషోర్, డాక్టర్ ఫరూక్, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ శ్రీవిద్య తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప అగ్రికల్చర్ : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏపీలోని అభ్యుదయ రైతులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రంతోపాటు ధ్రువీకరణ పత్రం, రూ. 5 వేలు నగదు పురస్కారం అందజేస్తారన్నారు. 2023–24 సంవత్సరానికి ఆసక్తిగల రైతులు ఈ నెల 20వ తేదీలోపు తమ దగ్గరలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధనస్థానంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వెబ్‌సైట్ www.angrau.ac.in లేదా సమీపంలోని కేవీకే, ఏరువాక కేంద్రాని సంప్రదించాలన్నారు.

168 రేషన్ బియ్యం బస్తాల పట్టివేత

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని మైదుకూరు రోడ్డులో ఉన్న ఎస్టేట్ ఏరియాలో అక్రమంగా నిల్వ ఉంచిన 168 రేషన్ బియ్యం బస్తాలను రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు ఎస్టేట్ ఏరియాలోని మసీదు వెనుక వైపు గల న్యూ కాంప్లెక్స్‌లో ఉన్న రూంలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం బస్తాలను నిల్వ చేశారని సమాచారం రావడంతో రూరల్ ఎస్ఐ శివప్రసాద్ సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. దాడిలో 168 రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. స్వరాజ్‌నగర్‌కు చెందిన పట్నం వరుణ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు.

ప్రశ్నపత్రాల బకాయిలను వెంటనే చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని ప్రైవేటు యాజమాన్య పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి కామన్ ఎగ్జామినేషన్ బోర్డుకు చెల్లించాల్సిన ప్రశ్నపత్రాల ఫీజు వెంటనే చెల్లించాలని డీసీఈబీ సెక్రటరీ శంకరయ్య తెలిపారు. పదవ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షల ప్రశ్నపత్రాలు తీసుకునే లోపు ఏ ఒక్క పాఠశాల బకాయిలు ఉండకూడదని డీఈఓ ఆదేశించారన్నారు.